# మార్పు

మరుసటిరోజు తమ యింటికి రాబోయే బంధువులకి బట్టలు పెట్టడానికి ఆ షాప్‌లో అడుగుపెట్టింది సరిత. దేదీప్యమానంగా వెలిగిపోతున్న లైట్ల వెలుతురుతో, పండుగ సందడితో ఆ బట్టలషాప్ కళకళలాడుతోంది. శారీ సెలక్షన్లో చీరలు చూస్తున్న సరిత తన పేరే పెట్టి ఎవరో పిలవడంతో తలతిప్పి చూసింది.

ఎదురుగా తన ప్రాణస్నేహితురాలు, ఒకప్పటి క్లాస్‌మేట్ కూడా అయిన విమల. తన కళ్లని తానే నమ్మలేకపోయింది. ఎక్కడో తిరపతిలో ఉండవలసిన విమల యిక్కడ?

“వాటే సర్‌ప్రైజ్ విమలా! నువ్వు యిక్కడేంటి? ఎప్పుడొచ్చావు మా ఊరు?” అడిగింది సరిత.

“మావారికి ట్రాన్స్‌ఫర్ అయింది యిక్కడికి. సరిగ్గా వారం రోజులయింది యిల్లు మారేసరికి. ప్రస్తుతం శాంతినగర్‌లో ఉంటున్నాము. నిన్ను కలవాలనే అనుకున్నానుగానీ వీలవలేదు. ఇంతకీ మీరెక్కడుండేది?” అంది విమల.

“ఇక్కడికి దగ్గరే. పద, మా యింటికి వెళ్ళి తీరిగ్గా మాట్లాడుకుందాం” అంది సరిత.

షాపింగ్ ముగించి, యిద్దరూ ఆటోలో సరితావాళ్ల యిల్లు చేరుకున్నారు.

సరిత భర్త రాజేష్, విమలని గుర్తుపట్టి పలకరించి ఆమె భర్త రమేష్ గురించి అడిగి తెలుసుకున్నాడు.

ఇద్దరూ వంటింట్లో కూర్చొని కబుర్లలో పడ్డారు. అయితే విమల కొంచెం అన్యమనస్కంగా ఉండటం సరిత దృష్టి నుంచి దాటిపోలేదు.

ఉండబట్టలేక ఎందుకు డల్‌గా ఉన్నావని అడిగినా మాట మార్చిందేగానీ, ఏమీ చెప్పలేదు విమల. భార్యాభర్తల మధ్య ఏమైనా అవగాహనాలోపం వచ్చిందో లేక యింకేమైనా సమస్యలు ఉన్నాయేమో అని మనసులో అనుకుని ఈసారి పనిలో పనిగా వాళ్లింటికి వెళ్లి అడగొచ్చనుకుంది.

కాఫీ, టిఫిన్లు అయ్యాక, ఆమెని ఆటో స్టాండ్‌కి తీసుకెళ్లి ఆటో ఎక్కించి పంపారు సరిత, ఆమె భర్త రాజేష్.

ఇంటికి తిరిగొస్తున్నప్పుడు అడగనే అడిగాడు రాజేష్.

“సరితా! నీ ఫ్రెండ్ ఏంటి డల్‌గా కనిపిస్తోంది. పెళ్లిలో కూడా గలగలా మాట్లాడింది. ఆమె మూడ్ ఎందుకో బాగాలేదు. గమనించావా?” అన్నాడు రాజేష్.

“అవును! ఎన్నిసార్లడిగినా ఎందుకో ఏం చెప్పలేదు. వచ్చే ఆదివారం, వాళ్లింటికి వెళ్లి ప్రాబ్లం ఏమిటో కనుక్కుంటాను” అన్నది సరిత.

“తప్పకుండా! ఎలాంటి సహాయమైనా తప్పకుండా చేద్దాం” తన తరపు నుంచి హామీ ఇచ్చాడు.

రాజేష్‌లాంటి భర్త దొరకడం తన అదృష్టం. ఇద్దరి తరపు బంధువులన్నా, స్నేహితులన్నా చాలా అభిమానం చూపెడతాడు. ఆఫీసులోను కాలనీలోను అందరికీ తన వీలైన సహాయ సహకారాలందిస్తూ మంచివాడుగా పేరు తెచ్చుకున్నాడు.

తను అనుకున్నట్లుగానే మరుసటి ఆదివారం విమల ఇంటికెళ్లి, తరచి తరచి అడగ్గా అసలు విషయం బయటపెట్టింది ఆమె.



విమల భర్త రమేష్ ఆమెని బాగానే చూసుకుంటున్నాడు. అయితే సరదాగా స్నేహితులతో అలవాటైన డ్రింక్స్, యిప్పుడు ఎక్కువై అతన్ని తాగుబోతుగా చేసింది. అదొక్కటే అతనిలోని బలహీనత. అందువల్ల ఆమె చాలా సమస్యలకి లోనవుతోంది. రెండుమూడు సార్లు అలిగి పుట్టింటికెళ్తే బతిమాలి, మందు మానేస్తానని మాటిచ్చి, ఆమెను తీసుకొచ్చి, మళ్ళీ మాట తప్పేవాడు.

ట్రాన్స్‌ఫరైతే కొత్త ఊరెళ్తే బాగు పడతాడేమోనని ఆమె మామగారు ప్రయత్నించి మరీ బదిలీ చేయించారు. తాగుబోతులకి యీజీగా తాగుబోతు స్నేహితులు దొరుకుతారు, అందుకు రమేష్ ఒక ఉదాహరణ.

ఆమె కథ విని నిట్టూర్చింది సరిత.

“నువ్వే ఏమైనా ఉపాయం చెప్పి పుణ్యం కట్టుకోవే తల్లీ! అతన్ని ఎలా మార్చాలో నాకు బోధపడటం లేదు” అంది నిస్పృహగా విమల.

కొద్దిసేపు ఇద్దరూ ఆలోచనల్లో పడ్డారు.

చివరికి-

“పోనీలేవే! నా సమస్యలతో నిన్ను బాధపెట్టాను. నా సమస్య తీరేది కాదుకానీ యిలా నిన్ను బాధపెట్టడం యిష్టంలేక నేనేమీ చెప్పలేదు నీకు ముందు. కాలమే అతనిలో మార్పు తీసుకురావాలి. రాజేష్‌లాంటి మంచివాళ్లు, ఉన్నత వ్యక్తిత్వంగలవాళ్లు అందరికీ దొరుకుతారా!” అంది విమల నిట్టూరుస్తూ.

ఆమె మాటలకి కించిత్తు గర్వం కలిగింది సరితకి. నిజమే మరి. తన భర్త రాజేష్ ఆదర్శపతి. తాగడం మాట అటుంచి, కనీసం సిగరెట్, కిళ్లీలాంటి అలవాట్లు కూడా లేవు.

హఠాత్తుగా ఆమెకో ఆలోచన తట్టింది. వెనువెంటనే తన ఆలోచన విమలకి తెలియపర్చింది.

“విమలా! ఒక ఉపాయం ఆలోచించాను. రేపు సాయంకాలం, రాజేష్ ఆఫీసు నుండి వచ్చాక, మీ యింటికి తీసుకొస్తాను. ఇద్దరికీ కామన్‌గా ఎలానూ చెస్ ఇంట్రస్ట్ ఉంది గనక యిద్దరూ కల్సిపోయి మంచి ఫ్రెండ్సవచ్చు. సత్సాంగత్యం వల్ల మార్పు సంభవమేమో ఎవరు చెప్పొచ్చారు? మీ ఆయన దురలవాట్లు పోయి, ఈయన మంచి అలవాట్లు-పుస్తక పఠనం, ఆర్ట్, సంగీతం పట్ల ఆసక్తి కలగవచ్చు కూడా” అంది సరిత.

విమల ఉత్సాహంగా వింది.

“ఆర్ట్, సంగీతం సంగతి దేవుడెరుగు, కనీసం తాగుడు ఒకటి మానేసి, మిగతా వ్యాపకాల్లో పడితే అంతేచాలు!” అంది.

స్నేహితురాళ్లిద్దరూ అనుకున్నదే తడవుగా ఆచరణల్లో పెట్టారు వాళ్ల ప్లాన్ని.

సరిగ్గా రెండు నెలల తర్వాత,

ఓ రోజు విమల, సరిత- సరితావాళ్లింట్లో కలుసుకున్నారు. ఇద్దరి ముఖంలో అంతులేని దిగులు. ఇద్దరికీ ఒక్కసారిగా పదేళ్ల వయసు పైబడినట్లు కనిపిస్తున్నారు. సరిత అయితే ఏడుపొక్కటే తరువాయి.

“ఆయన్లో మార్పుకోసం రాజేష్‌గారితో స్నేహం ప్రోత్సహించడం చాలా పొరపాటైంది. నా సమస్య వల్ల నీకు కూడా యిప్పుడు కష్టాలు మొదలయ్యాయి. అయితే మా ఆయన వల్ల రాజేష్‌గారు కూడా మారిపోతారనుకోలేదు. ఇప్పుడు మనం వాళ్లిద్దరిలో మార్పుకోసం నడుం బిగించవలసిందే” అనునయిస్తోంది విమల సరితని.

పాపం! సరితకి యింకా నమ్మశక్యం కావడం లేదు. ఈ రెండు నెలల్లో, రమేష్ తాగడం మానడం మాటలా ఉన్నా, రమేష్ వల్ల రాజేష్ కూడా పక్కా తాగుబోతయ్యాడు. సత్సాంగత్యం వల్ల ఫలితమేమీ లేకపోగా, దుస్సాంగత్యం వల్ల, దుష్ఫలితం మాత్రం అనుభవంలోకి వచ్చింది వాళ్లకి. వాళ్లల్లో మార్పు ఎన్నడు రానున్నదో, ఏమో?

-డి.వి.డి.ప్రసాద్ (పదంపూర్, ఒరిస్సా)